
ఈనాడు పల్నాడు

శుక్రవారం సెప్టెంబరు 27, 2024

❖ ఆర్థికసంఘ నిధులతో గ్రామాల్లో సమస్యలకు పరిష్కారం

❖ అందుబాటులోకి రానున్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు

పంచాయతీలకు మంచి కాలం



ఈనాడు డిజిటల్, నరసరావుపేట

గ్రామ స్వరాజ్యమే దేశాభివృద్ధికి పునాది.. అని గాంధీజీ అన్న మాటలను గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. పంచాయతీలకు కేటాయించిన ఆర్థిక సంఘ నిధులను పక్కదారి పట్టించింది. దీంతో గత ఐదేళ్లలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. కనీసం బ్లీచింగ్ కూడా కొనలేని దుస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాలకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది. ఆర్థిక సంఘ నిధులను పంచాయతీలకే కేటాయించడంతో ఇప్పుడిప్పుడే సమస్యల నుంచి గట్టెక్కుతున్నాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో పంచాయతీలకు మహర్దశ వచ్చినట్టయింది. నిధులను సద్వినియోగం చేసుకుంటూ పేరుకుపోయిన బకాయిలను తీరుస్తూ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

జిల్లాలో పంచాయతీలు: 526

టైడ్ గ్రాంట్: రూ.17,70,32,183

అన్‌టైడ్ గ్రాంట్: రూ.11,80,21,299

ఆర్థిక సంఘ నిధుల వినియోగం ఇలా..

పదిహేనో ఆర్థిక సంఘం నిధులను ప్రధానంగా ఐదు పనులకు వినియోగించనున్నారు. అవీ.. హరిత రాయబారులకు జీతాల చెల్లింపు, ఘన వ్యర్థాల నిర్వహణకు, కరెంటు బిల్లుల చెల్లింపు, మురుగు కాల్వల తవ్వకం, సీసీ రహదారుల నిర్మాణం. అంతేకాకుండా వాటర్ ట్యాంకులను శుభ్రపరిచి, క్లోరినేషన్ చేయనున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో అన్ని గ్రామాల్లో ఉన్న హరిత రాయబారులకు జీతాలు చెల్లిస్తున్నారు. పంచాయతీల విద్యుత్తు బిల్లులకు కూడా ఈ నిధులను వినియోగిస్తున్నారు. అక్టోబర్ 2 నుంచి జిల్లాలో ఉన్న ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాల(చెత్త నుంచి సంపద సృష్టి)ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛభారత్ లక్ష్యంగా చెత్తను రోడ్లపై వేయకుండా సంపద కేంద్రాల్లోకి మళ్లిస్తూ ఎరువుల తయారీకి వినియోగించనున్నారు. ఇందుకు ఆర్థిక సంఘ నిధులను వినియోగించి ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలను బాగు చేయనున్నారు. ఐదేళ్లుగా మూతపడి ఉండటంతో తిరిగి వాడుకలోకి తీసుకురానున్నారు. మరోవైపు గ్రామాల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అన్ని పంచాయతీల నుంచి జాబితా తెప్పించుకొని నిర్మాణాలు చేపట్టనున్నారు.

టైడ్ గ్రాంట్ నిధులతో చేయాల్సిన పనులు: గ్రామాల్లో పారిశుద్ధ్యం, దీపాలు, తాగునీరు, క్లాప్‌మిత్ర, సిబ్బందికి వేతనాల చెల్లింపు

అన్‌టైడ్ గ్రాంట్ నిధులతో చేపట్టాల్సిన పనులు: సిమెంటు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు



75 త్యాళ్ళూరులో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం

గ్రామాల్లో చేపట్టే పనులు సిద్ధం చేస్తున్నాం

గత నెలలో విడుదలైన ఆర్థిక సంఘం నిధులను ప్రణాళికాపరంగా వినియోగిస్తున్నాం. అందులో భాగంగా ముందుగా హరిత రాయబారులకు జీతాలు చెల్లిస్తున్నాం. గ్రామాల్లో ఎలాంటి పనులు తొలుత చేపట్టాలో సర్పంచులు, గ్రామస్థులతో మాట్లాడి వారి అభిప్రాయాల మేరకు ముందుకెళ్తాం. అక్టోబర్ 2 తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలతో గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నాం. **- విజయభాస్కర్‌రెడ్డి, డీపీవో**

గురుకుల పాఠశాల పరిశీలనకు కమిటీ

యడ్లపాడు, న్యూస్‌టుడే: వంకాయలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇటీవల పదో తరగతి విద్యార్థులు గోడ దూకి పారిపోయిన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు కారంపూడి, తాడికొండ, ముండూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లతో కమిటీ ఏర్పాటు చేసినట్లు గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ గురువారం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జలవనరులశాఖలో బదిలీలు

ఈనాడు, నరసరావుపేట

జలవనరులశాఖలో పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో లింగంగుంట్ల పర్యవేక్షక ఇంజినీరుగా ఉన్న వరలక్ష్మిని ఒంగోలు జలవనరులశాఖ సర్కిల్ ఎస్‌ఈగా బదిలీ చేశారు. కావలిలో పని చేస్తున్న కృష్ణమోహన్‌ సాగర్ కుడికాలువ పరిధిలో లింగంగుంట్ల డివిజన్ మానిటరింగ్ ఈఈగా బదిలీపై వస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చిన్ననీటిపారుదలశాఖ కార్యనిర్వాహక ఇంజినీరుగా కల్లూరి రమేష్ పాడేరు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పోస్టు ఖాళీగా ఉండటంతో దుగ్గిరాల డీఈ ప్రసాద్ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక ఇంజినీరుగా పని చేశారు. గతంలో ఇక్కడ కార్యనిర్వాహక ఇంజినీరుగా ఉన్న రమేష్‌ వైకాపా ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధికి అనుకూలంగా వ్యవహరించలేదనే కారణంతో ఇక్కడి నుంచి పాడేరుకు బదిలీ చేశారు. తాజా బదిలీల్లో రమేష్ గుంటూరు సర్కిల్‌లో కార్యనిర్వాహక ఇంజినీరుగా వచ్చారు. అదేవిధంగా కృష్ణా పశ్చిమ డెల్టాలో తెనాలి కార్యనిర్వాహక ఇంజినీరుగా పనిచేస్తున్న మల్లికార్జున కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టుకు బదిలీపై వెళ్లారు. రేపల్లె మురుగునీటిపారుదల విభాగంలో కార్యనిర్వాహక ఇంజినీరుగా పనిచేస్తున్న వెంకటరత్నంను కృష్ణా పశ్చిమ డెల్టాలో తెనాలి ఈఈగా బదిలీపై పంపించారు. విజయవాడ సర్కిల్‌లో నీరు-ప్రగతి ఎస్‌ఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావును [illegible] బదిలీ చేశారు. విజయవాడ ముఖ్య ఇంజినీరు కార్యాలయంలో పనిచేస్తున్న శ్యాంప్రసాద్‌ను గుంటూరులోని గేజింగ్ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో పనిచేస్తున్న శివరాంప్రసాద్ గుంటూరులోని పులిచింతల ప్రాజెక్టు డివిజన్-4కు బదిలీపై వస్తున్నారు.

పర్యాటకం.. ప్రగతి చోదకం

❖ జిల్లాలో సందర్శనీయ క్షేత్రాలు ఎన్నో..


❖ ప్రభుత్వం దృష్టిసారిస్తే మరింత ఉపాధి అవకాశాలు

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, సత్తెనపల్లి, అమరావతి



జిల్లాలో ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి ప్రసాదిత రమణీయ దృశ్యాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఉండవల్లి గుహలు, ప్రకాశంబ్యారేజీ అందాలు, అమరావతి ధ్యానబుద్ధ విగ్రహం, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి, ఉప్పలపాడు పక్షుల కేంద్రం, కొండవీడు కోట, గుత్తికొండ బిలం, దైద అమరలింగేశ్వరస్వామి, కోటప్పకొండ, నాగార్జునసాగర్ కొండ, అనుపు, సూర్యలంక తదితర ప్రాంతాలతో పాటు ఎకో టూరిజం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ప్రకృతి రమణీయత మధ్య ప్రవహించే కృష్ణా నది.. బంగాళాఖాతం తీర ప్రాంతంలో ఆకట్టుకునే బీచ్‌లు జిల్లాకు పర్యటకంగా అదనపు సొబగులు అద్దుతున్నాయి. అయితే ఆయా ప్రాంతాల్లో వసతులు మెరుగుపరిచి పర్యాటక అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక కథనం.

❖ పంచారామాల్లో మొదటిదైన అమరావతి, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి, పెదకాకాని శివాలయం, పొన్నూరు ఆంజనేయస్వామి, కోటప్పకొండ మీద కొలువైన శివుడు, దైద అమరలింగేశ్వరస్వామి, వైకుంఠపురంలో వెలసిన వెంకటేశ్వరస్వామి, గుంటూరులోని మస్తానయ్య దర్గా, ఫిరంగిపురంలోని పురాతన చర్చి ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆధ్యాత్మికంగా దేనికదే ప్రత్యేకత కలిగిఉన్నాయి. అమరావతిలో 125 అడుగుల ధ్యాన బుద్ధ విగ్రహాన్ని నిర్మించారు. విగ్రహం లోపలివైపు బౌద్ధుల చరిత్ర తెలిపేలా చెక్కిన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఆయా ప్రజలు దేశ, విదేశాల నుంచి ఇక్కడి ఆలయాలను సందర్శిస్తున్నారు.



కోటప్పకొండ



కొండవీడు కోట

❖ బాపట్ల తీరంలోని సూర్యలంక బీచ్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తోంది. వారాంతాల్లో సేదతీరడానికి పర్యటక నిలయంగా మారింది.

❖ ప్రకృతి ప్రసాదిత కృష్ణానది అందాలు పర్యటకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ ఏడాది కృష్ణానదికి ఎక్కువ రోజులు వరద నీటి ప్రవాహం ఉండటంతో నదికి జలకళ సంతరించుకుంది. కృష్ణానదిపై నాగార్జునసాగర్, టెయిల్‌పాండ్, పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయిలో నిండి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

❖ కొండవీడు కొండల పచ్చదనం, వంకరలు తిరుగుతూ సాగే కొండవీడు ఘాట్ రోడ్డు, ఉదయాన్నే అక్కడి చల్లదనం, ఎటుచూసినా పండ్లు, కూరగాయలు, పూల తోటలు మదిని మరిచిపోయేలా ఆకట్టుకుంటున్నాయి. కొండవీడు కోటను సాహస క్రీడలకు అనుకూలంగా అభివృద్ధి చేశారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులు ట్రెక్కింగ్ చేసి ప్రోత్సహించారు. ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఇక్కడి కొండలను అభివృద్ధి చేయాలి.



అమరావతిలోని ధ్యాన బుద్ధ కేంద్రం

ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆకట్టుకునే పర్యాటక, ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఉండటంతో ఏటికేడు పర్యటకుల సంఖ్య పెరుగుతోంది. దేశ, విదేశీ పర్యటకులు వస్తుండటంతో వారి అభిరుచులకు అనుగుణంగా ఇక్కడి సంస్థలు సేవలు అందిస్తున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమంది పర్యాటక రంగం ఆధారంగా ఉపాధి పొందుతున్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పర్యాటక రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రగతి చోదకంగా నిలుస్తుందని జిల్లా వాసులు చెబుతున్నారు.

పర్యాటక సర్క్యూట్‌లతో అభివృద్ధి

పర్యాటక ప్రాంతాల్లో వసతులు కల్పించి నరసరావుపేట నుంచి పల్నాడు జిల్లాలోని ప్రముఖ పర్యాటక, దర్శనీయ ప్రాంతాలకు పర్యాటకుల్ని తీసుకెళ్లేలా గతంలో కార్యచరణ రూపకల్పన చేశారు. ఆ ప్రతిపాదనల్ని ఆచరణలోకి తీసుకొస్తే పర్యటకంగా మరింత అభివృద్ధి జరుగుతుంది. ఆ సర్క్యూట్లు ఇలా... ❖ నరసరావుపేట నుంచి కోటప్పకొండ, చెంఘీజ్‌ఖాన్‌పేట ఇస్కాన్ టెంపుల్, కొండవీడు, అమరావతికి తీసుకెళ్లి రాత్రికి మళ్లీ నరసరావుపేటకు తీసుకురావాలనే ఆలోచన చేశారు.

❖ నరసరావుపేట నుంచి బయలుదేరి చేజర్ల కపోతేశ్వర ఆలయం, గుత్తికొండ బిలం, కారంపూడి వీర్ల దేవాలయం, దైద, మాచర్ల చెన్నకేశవ ఆలయం, ఎత్తిపోతల, నాగార్జునసాగర్ చూపించడం ఒక ప్యాకేజి అయితే ఇందులోనే రాత్రికి నాగార్జునసాగర్‌లో విశ్రాంతి తీసుకుని మరుసటి రోజు నాగార్జునకొండ, అనుపు చూపించి నరసరావుపేటకు తీసుకురావాలనే ఆలోచన ఉంది.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఈ నెల 28 నుంచి 30 వరకు 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్-17 బాల బాలికలకు వినుకొండ లయోల పాఠశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 13 జిల్లాల నుంచి 520 మంది బాల బాలికలతో పాటు శిక్షకులు, మేనేజర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇప్పటికే గుంటూరు జిల్లా జట్లు వినుకొండకు వచ్చి సాధన చేస్తున్నారన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఫాదర్ రవి, డైరెక్టర్ జ్ఞాన్‌దేవ్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీఈవో వెంకటేశ్వర్లు సహాయ సహకారాలు అందిస్తున్నారని వివరించారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజనం ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.



సాధన చేస్తున్న గుంటూరు జిల్లా జట్టు సభ్యులు

కుళ్లిన టమాట.. ఎండిన బెండ

☛ వాటితోనే విద్యార్థులకు కూరలు

☛ ఆశ్రమ పాఠశాలలో దయనీయం



మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

గిరిజనుల్ని విద్యావంతులు చేసేందుకు ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేస్తోంది. చెంచుల విద్యాభ్యాసానికి ప్రత్యేకంగా ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పింది. అయితే వాటిపై పర్యవేక్షణ కొరవడటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోంది. కుళ్లిన కూరగాయలతో వంటలు చేస్తూ వడ్డిస్తున్నారు. ముద్దగా ఉన్న అన్నం.. నీళ్ల మజ్జిగ అందిస్తున్నారు. దీనికితోడు విద్యార్థుల లెక్క తక్కువగా చూపి, సొమ్ము బొక్కేస్తున్నారు. బోధన కూడా అంతంత మాత్రమే.

ప్రభుత్వ సొమ్ము పక్కదారి: పల్నాడు ప్రాంతంలోని వెనుకబడిన మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెంలో గిరిజనుల (చెంచుల) విద్యా ప్రగతికి ఆశ్రమ పాఠశాలను దశాబ్దాల కిందట ఏర్పాటు చేశారు. అనుపు, స్థానిక చెంచుకాలనీలోని విద్యార్థులకు ప్రాథమికోన్నత పాఠశాలను 5 ఎకరాల్లో 18 తరగతి గదులతో నిర్మించారు. ఇక్కడ 126 మంది బాలురు విద్యాభ్యాసం చేస్తున్నట్లు దస్త్రాల్లో పొందుపరిచారు. పాఠశాలకు నిత్యం 90 మంది వరకు హాజరవుతున్నట్లు చూపుతున్నారు. బుధవారం పాఠశాలలో పరిశీలిస్తే 40 మంది కూడా రాలేదు. వీరిలో కొంతమంది మధ్యాహ్న భోజనం తిని తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మెనూ ప్రకారం ఇక్కడ వంటలు చేయడం లేదు. వారాల పాటు కూరగాయలను నిల్వ ఉంచుతున్నారు. అవి కుళ్లిపోయినా కూరల్లో ఉపయోగిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. అన్నం ఉండలుగా ఉంటోంది. పెరుగు స్థానంలో నీళ్ల మజ్జిగ విద్యార్థులకు వడ్డిస్తున్నారు. నిత్యం కోడి గుడ్డు ఇవ్వాల్సి ఉండగా ఆ ఊసే లేదు. పండ్లు, చిక్కీలు, గుగ్గిళ్లు అందించడం లేదని తెలుస్తోంది. ఎక్కువ సంఖ్య చూపుతూ ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



మధ్యాహ్న భోజనానికి హాజరైన విద్యార్థులు వీరే..

నలుగురే ఉపాధ్యాయులు: పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయులకు గాను నలుగురు మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిని డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలలకు బదిలీ చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు వాడకంలో లేకపోవటంతో పిచ్చి చెట్లు మొలిచాయి. నీటి శుద్ధి ప్లాంటు ఉన్నా.. ఉపయోగించకుండా బయట నుంచి క్యాన్లు తెప్పిస్తున్నారు.

అన్ని వసతులు కల్పిస్తున్నాం

ఆశ్రమ పాఠశాలలో అన్నీ సక్రమంగానే ఉన్నాయి. విద్యార్థులు జ్వరాలు, విరేచనాలతో పాఠశాలకు రాలేదు. అందుకే హాజరు తక్కువగా ఉంది. ప్రతి రోజు 90 మందికిపైగానే వస్తున్నారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నాం. అన్ని వసతులు ఉన్నాయి. **- శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు**

పైరు పచ్చగా.. సురక్షితంగా..

✦ నియంత్రిత వాతావరణంలో సాగుకే రైతుల మొగ్గు

✦ పెరుగుతున్న నర్సరీలు

ఈనాడు, అమరావతి

ఆగస్టులో 35 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు.. వేసవిని తలపించేలా పొడి వాతావరణం. ఒక్క రోజు వ్యవధిలోనే 25 సెంటీమీటర్ల వర్షపాతం.. ఇలా భిన్న పరిస్థితుల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ అనూహ్య మార్పులను ఎదిగిన పంటలు తట్టుకోలేకపోతున్నాయి. విత్తనాలు మొలకెత్తే దశలో వాతావరణ అసమతుల్యం వల్ల మొలక సమస్య తీవ్రమవుతోంది. అధిక ఎండలు, గాలులు, వానలకు అవి మొలకెత్తడం లేదు. మళ్లీ దుక్కులు చేసి కొత్తగా విత్తనాలు నాటాల్సి వస్తోంది. ఇందుకు నెల రోజుల సమయం పడుతోంది. దీనివల్ల రైతులపై పెట్టుబడుల భారం పెరిగిపోతోంది. కొన్నిసార్లు అదును తప్పిపోయిన సందర్భాలూ ఉన్నాయి. తెగించి.. అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేసి ఆరుబయట నారుమడిలో పెంచినా.. ఎద పెట్టినా.. మొలక సమస్యలొస్తున్నాయి. జులై, ఆగస్టు మాసాల్లో వాతావరణం పంటల తొలి దశను ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయంగా రక్షిత నారుమడులు (షెడ్‌నెట్) ద్వారా నారు పెంచి పొలంలో నాటుకునే విధానంపై ఆసక్తి పెంచుకుంటున్నారు.




షెడ్‌నెట్‌లో పెంచిన కాకర మొక్క

కాకర నుంచి బ్రకోలి వరకు..

మిరప, టమాటా, వంగ, బంతి, చామంతి వంటి నారును నర్సరీల్లోని షెడ్‌నెట్‌లో పెంచుతుంటారు. తాజాగా ఈ జాబితాలోకి కాకర, చిక్కుడు, బ్రకోలి చేరాయి. షెడ్‌నెట్‌లో 15 రోజులు పెంచిన తరువాత నారును పొలంలో నాటుతున్నారు. నియంత్రిత ఉష్ణోగ్రతల వల్ల షెడ్‌నెట్లలో నారు పెంచి పొలంలో నాటడం వల్ల సకాలంలో పంటల సాగుకు అవకాశమేర్పడుతోంది. ప్రస్తుతం సంకర కాకర విత్తనం ఖరీదు రూ. 2కుపైగా ఉంటోంది.

విత్తనాల సంఖ్యను బట్టి ధర

కొన్నాళ్ల క్రితం వరకు విత్తనాలను గ్రాములు, కిలోల చొప్పున విక్రయించేవారు. కొన్ని రకాల వాణిజ్య పంటలకు సంబంధించి ప్రస్తుతం విత్తనాల సంఖ్యతో మార్కెటింగ్ చేస్తున్నారు. ఒక విత్తన సంచిలో వెయ్యి, 1,500 విత్తనాలుంటున్నాయి. ఒక్కో విత్తనం ఖరీదుగా మారుతోంది. ప్రస్తుతం సంకర కాకర విత్తనం ధర రూ. 2కుపైగానే ఉంది. ఒక కాకర మొక్కను 15 రోజులు పెంచినందుకు 60 నుంచి 70 పైసలు తీసుకుంటున్నారు. అయినా ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి బయటపడొచ్చని రైతులు నర్సరీలను ఆశ్రయిస్తున్నారు.



షెడ్‌నెట్‌లో పెంచుతున్న కాకర నారు

విస్తరిస్తున్న నర్సరీలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం కాకర, చిక్కుడు, బ్రకోలి మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. నారాకోడూరు, రాజుపాలెం, బొల్లాపల్లి, వినుకొండ, వెల్దుర్తి తదితర ప్రాంతాల్లో నర్సరీలు విస్తరిస్తున్నాయి. భవిష్యత్తులో మరి కొన్ని పంటల మొక్కలనూ ఇందులో పెంచనున్నారు. 40 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతల సమయంలో విత్తనాలు సక్రమంగా మొలకెత్తేలా, తొలి దశలోని పంటల మొక్కలు ఆశాజనకంగా ఎదిగేలా విత్తనంలోనే మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు.

గీత దాటారు.. వేటు పడింది!

ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడింది. ఈ పరిణామం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఏకకాలంలో నలుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడటం ఈ మధ్య కాలంలో ఇదే తొలిసారి కావటం గమనార్హం. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఇచ్చిన నివేదిక ను అనుసరించి వారిని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పోలీసింగ్ దారి తప్పడం. అమాయకులపై దాడులకు తెగబడడం తెలిసిందే. కూటమి ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అందుకు భిన్నంగా గుంటూరు నగరంలో ఇటీవల ఓ కేసు విషయంలో ఓ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు గీత దాటి వ్యవహరించినట్టు ఎస్పీ విచారణలో తేలింది. ఇందుకు వారు మూల్యం చెల్లించుకున్నారు. ఒంగోలుకు చెందిన ఓ యువకుడిపై భార్య ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆ యువకుడికి ముందస్తు అరెస్టు నోటీసులు ఇవ్వకుండా.. మీపై కేసు ఉందని, అరెస్టు చేస్తున్నామని చెప్పి బలవంతంగా జీపులో ఎక్కించుకుని తీవ్రంగా వేధించారు. ఆ యువకుడు వారి బారి నుంచి తప్పించుకుని అదే రోజు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీని తీవ్రంగా పరిగణించిన ఆయన వెంటనే విచారణ చేయించారు. ఈ వ్యవహారంలో గీత దాటిన సీఐ బిలాలుద్దీన్ సహా కానిస్టేబుళ్లు చాంద్‌బాషా, షేక్ నూరుల్లాపై సస్పెన్షన్ వేటు వేశారు.

☛ గతంలో పొన్నూరు సీఐగా పనిచేసిన మీసాల రాంబాబుపై అనేక అవినీతి ఆరోపణలొచ్చాయి. ఆ నియోజకవర్గానికి చెందిన నేత, ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా... సంగం పాల డెయిరీ వద్దకు ఆందోళనకు వచ్చిన రైతులను కొట్టి దూషించినట్లు ఆయనపై హత్యాయత్నం కేసులు పెట్టారు. అది తప్పుడు కేసుగా నిర్ధారించి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. తనపై తప్పుడు కేసు పెడుతున్నారని నరేంద్ర గతంలోనే హెచ్చరించారు. మరోవైపు ఆ సీఐపై కొందరు క్వారీ యజమానులు ఫిర్యాదు చేశారు. వాటన్నింటిపై ఎస్పీ విచారణ చేయించి నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాంబాబును సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ సీఐగా ఉన్నారు.

జీఎస్టీ ఏసీగా వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: వస్తు, సేవా పన్నుల(రాష్ట్ర విభాగం) అసిస్టెంట్ కమిషనర్‌గా జి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. విశాఖపట్నం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ స్థానంలో ఇప్పటి వరకు పనిచేసిన మనోరమను గుంటూరు-1కు బదిలీ చేశారు. నరసరావుపేట కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయన్ను వాణిజ్య వర్తకుల సంఘం అధ్యక్షుడు వనమా సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి సతీష్, కార్యవర్గ సభ్యులు గురువారం సన్మానించారు.



వెంకటేశ్వర్లును సన్మానించిన వాణిజ్య సంఘ నేతలు

స్వయంకృషితో విశ్వనరుడిగా ఎదిగిన జాషువా

గుంటూరు: పేదరికం, అంటరానితనం ఎదుర్కొన్న స్థాయి నుంచి విశ్వనరుడి స్థాయికి ఎదిగిన మహాకవి గుర్రం జాషువా అని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని మహాకవి విగ్రహం దగ్గర జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో 'జాషువా సాహిత్యం-జీవితం' అనే అంశంపై సభ గురువారం జరిగింది. సభకు తెనాలి ప్రభుత్వ సహాయ న్యాయవాది శుద్ధపల్లి సుకుమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ జాషువా ఆకలి బాధలు అనుభవించిన దిగువ స్థాయి నుంచి సమాజాన్ని దర్శించి కవిత్వాన్ని రాశారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జాషువా కవి మాత్రమే కాదని, తెలుగు భాషా సాంస్కృతిక ప్రతినిధి అని కొనియాడారు. జాషువా పద్యాలు పండితులే గాక పామరులు కూడా అలవోకగా పాడగలగడం ఆయన కవిత్వ గొప్పతనమన్నారు.

సెపక్‌తక్రా, రగ్బీ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన రగ్బీ బాలబాలికల జట్లతో క్రీడా ప్రతినిధులు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 బాల బాలికల సెపక్‌తక్రా, అండర్-19 రగ్బీ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డెంపూడి పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులతో మాట్లాడారు. అండర్-19 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకరరావు పర్యవేక్షించారు.

అండర్-19 బాలుర రగ్బీ జిల్లా జట్టు: టి.పవన్‌కుమార్, పి.పవన్‌కృష్ణ, ఈ.ప్రదీప్, జి.మనోజ్‌కుమార్, ఎం.నాగరాజు, షేక్ జాస్మీర్, పి.సాయిగణేష్, కె.దుర్గాప్రసాద్, కె.భాను, షేక్ రియాజ్, మహమ్మద్‌రియాజ్, పణీంద్ర, పి.శ్రీకాంత్, ఎన్.రవితేజ

అండర్-19 బాలికల రగ్బీ జిల్లా జట్టు: జె.రోజ్‌మేరి, జి.శ్రీలక్ష్మి, టి.ప్రవల్లిక, ఎం.పుష్పలత, పి.కోమలి, సీహెచ్.అలేఖ్య, జస్పాల్‌కర్వీన్, ఎం.నాగమణి, జి.సౌమ్య, ఎ.త్రివేణి, జె.దేవి, షేక్ సల్మా, కె.ప్రవల్లిక, బి.అఖిల, జి.సుచరిత

అండర్-14 బాలుర సెపక్‌తక్రా జట్టు: ఎం.మనోహర్, ఆర్.సంతోష్‌కుమార్, టి.మనోహర్‌బాబు, షేక్ మహమ్మద్‌తౌఫిక్, బి.కార్తిక్

అండర్-14 బాలికలు: పి.గాయత్రి, కె.గీతిక, డి.అక్షయ, ఎం.హర్షిణి, బి.ప్రగతి

అండర్-17 బాలురు: పి.శ్రీకిరణ్, పి.గోపీచంద్, బి.అనిల్‌కుమార్, ఎం.ప్రభుదాసు, ఎం.లోకేష్

అండర్-17 బాలికలు: ఎం.నాగలక్ష్మి, ఎ.మానస, కె.కీర్తన, బి.మోక్షసాధన, బి.సాత్విక

అండర్-19 బాలురు: కె.శ్రీనాథ్, జి.హర్ష, వై.ప్రభుదాస్, కె.విజయభోళడు, బి.నాని

అండర్-19 బాలికలు: టి.యామిని, కె.షైన్సీ, వి.మౌనిక, వి.భావన శ్రీకుమారి, ఒ.దీవెన

తిరుమల లడ్డూ తయారీలో బాధ్యతా రాహిత్యమా?

పెదకూరపాడు: తెలుగువారి ఇలవేల్పు వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు పదార్థాలు కలిపినందుకు స్థానికంగానే కాకుండా ప్రవాస భారతీయులందరినీ ఆందోళన కలిగిస్తోందని ఎన్నారై తెలుగు విభాగ సమన్వయకర్త మాగులూరి భానుప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో తిరుమల లడ్డూ తయారీలో బాధ్యతా రాహిత్యంపై ప్రదర్శన నిర్వహించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన వైకాపా నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధి నిధులు బొక్కేశారు

☛ వైకాపా నాయకులకు క్షేత్ర సహాయకుల సహకారం
☛ మృతులు, ఉద్యోగులు కూడా కూలీలే..



సత్తెనపల్లి, న్యూస్‌టుడే

వలసల నిర్మూలన.. ఇంటిపట్టునే కూలీలకు ఉపాధి కల్పనకు ఉద్దేశించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల్ని వైకాపా నాయకులు డ్వామా ఉద్యోగులు, క్షేత్ర సహాయకులతో కలిసి స్వాహా చేశారు. ఉపాధి కూలీల హాజరులో అవకతవకలకు అవకాశం లేకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన హాజరు నమోదు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినా దానికి కూడా మస్కా వేశారు. కూలీల హాజరులోనే అన్ని మండలాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. మృతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఒప్పంద ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్ని సైతం ఉపాధి కూలీలుగా చూపించి ప్రజాధనాన్ని వాటాలుగా వైకాపా ద్వితీయశ్రేణి నాయకులు, క్షేత్ర సహాయకులు పంచుకున్నారు. మొక్కల పేరుతో రూ.లక్షల నిధులు మెక్కేశారు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పని దినాల కల్పన లక్ష్యం : 86 లక్షలు
కల్పించిన ఉపాధి పని దినాలు : 85.37 లక్షలు
కూలీలకు వేతనాల రూపంలో ఖర్చు రూ.203.87 కోట్లు
సామగ్రి ఇతర వేతనాల రూపంలో ఖర్చు రూ.70.20 కోట్లు

అన్ని మండలాల్లో అవినీతి.. అక్రమాలు

2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు ప్రస్తుతం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత తనిఖీలు, ప్రజావేదికల నిర్వహణ వేగవంతం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు ఎనిమిది మండలాల్లో సామాజిక తనిఖీలు పూర్తవగా అన్నిచోట్లా అక్రమాలు బహిర్గతమయ్యాయి. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లో అవినీతి ఎక్కువగా చోటు చేసుకున్నట్లు తనిఖీల ద్వారా అధికారులు గుర్తిస్తున్నారు. నాదెండ్ల, నరసరావుపేట, ముప్పాళ్ల, దుర్గి, యడ్లపాడు, శావల్యాపురం మండలాల్లో అక్రమాలు బయటపడ్డాయి. తాజాగా రొంపిచర్ల మండలంలో సామాజిక తనిఖీలు పూర్తవగా రూ.3 లక్షల అవినీతి బహిర్గతమైంది. మరో రూ.6 లక్షల పనులపై విచారణకు అధికారులు ఆదేశించారు.

☛ దుర్గి మండలంలోని ఆత్మకూరు, శ్యామరాజపురంలతో పాటు మరికొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీవోఏలను ఉపాధి పనులకు హాజరైనట్లు బోగస్ హాజరు వేసి చెరువులు, కుంటలు, కాల్వల మరమ్మతుల్లో అవినీతికి పాల్పడ్డారు. వైకాపా నాయకులు క్షేత్ర సహాయకులు, డ్వామా ఉద్యోగులు కుమ్మక్కై రూ. 3.37 లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి.

☛ రాజుపాలెం మండలంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు పూర్తవక ముందే అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. మాజీ మంత్రి అంబటి రాంబాబు అనధికార వ్యక్తిగత సహాయకుడిని ఉపాధి కూలీగా చూపించి నిధులు దారి మళ్లించారు. అతడి భార్య పశు సంవర్ధక శాఖలో కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తుండగా ఆమెను కూడా ఉపాధి కూలీగా చూపించారు. ఏక కాలంలో ఉపాధి హామీ పనులు, కంప్యూటర్ ఆపరేటర్‌గా నిధులు ఎలా చెల్లించారని ప్రశ్నలు సమాధానం లేదు.

☛ రాజుపాలెంలో విద్యుత్తు ఉప కేంద్రంలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగిని కూడా ఉపాధి కూలీగా చూపించి నిధులు స్వాహా చేశారు.

☛ రాజుపాలెం ఎంపీడీవో కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి ఉపాధి హామీ పనులకు హాజరైనట్లు చూపించి రూ.55 వేలు ఖాతాలకు మళ్లించారు. అక్కడి ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న వారిని సైతం ఉపాధి కూలీలుగా చూపించి నిధులు స్వాహా చేశారు.

అవినీతి నిధుల్ని కక్కిస్తాం..

2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు జిల్లావ్యాప్తంగా చేస్తున్నారు. ఇప్పటికి ఎనిమిది మండలాల్లో తనిఖీలు పూర్తయ్యాయి. కూలీల హాజరులోనే ఎక్కువగా అక్రమాలు బయటపడుతున్నాయి. మొక్కల పేరిట కొన్నిచోట్ల నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించాయి. ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. పక్కదారి పట్టిన ఉపాధి నిధుల్ని సంబంధితుల నుంచి కక్కిస్తాం. ఎన్నికల సమయంలో క్షేత్ర సహాయకుల వేతనాలు ఆగిపోయి మా వద్దే ఉన్నాయి. వాటిని ప్రస్తుతం బయటపడుతున్న అవినీతి నుంచి రికవరీ చేస్తున్నాం. ఉపాధి నిధులకు సంబంధించి ప్రతిపైసా పారదర్శకంగా ఖర్చయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. **- జోసెఫ్‌కుమార్, డ్వామా పీడీ**

పెండింగ్ కేసుల సత్వర దర్యాప్తుతో బాధితులకు న్యాయం


మండల చిత్రపటాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసులను ప్రణాళికబద్ధంగా సత్వరమే దర్యాప్తు చేయడంతో బాధితులకు న్యాయం జరుగుతుందని, సకాలంలో నిందితులను అరెస్టు చేయడంతో పాటు న్యాయస్థానంలో ఛార్జిషీట్ జాప్యం లేకుండా దాఖలు చేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. నరసరావుపేట గ్రామీణ ఠాణాను ఎస్పీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రదేశాల్లో నిఘా పెంచి గస్తీ ముమ్మరం చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలన్నారు. మహిళలపై దాడులు, రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని సూచించారు. ఆయనతో పాటు డీఎస్పీ కె.నాగేశ్వరరావు, గ్రామీణ సీఐ రామకృష్ణ, ఎస్సై కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన పరిహారం ఇస్తాం



రైతులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే

నకరికల్లు, న్యూస్‌టుడే: ఒడరేవు నుంచి పొందుగల వరకు రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం అందిస్తామని జేసీ సూరజ్ గనోరే తెలిపారు. గురువారం నకరికల్లు తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. 173 మంది రైతులకు సంబంధించి 61.90 ఎకరాల భూహక్కు పత్రాలను జేసీకి అందజేశారు. భూ ప్రక్రియలో మూడు విభాగాలుగా కేటాయించామన్నారు. మొదటిది రోడ్డు అనుసంధానంగా ఉండే భూములు, రెండోది వ్యవసాయ భూములు, మూడోది ఇంటి స్థలాలు.. వాటికి వేర్వేరు ధర నిర్ణయించినట్లు జేసీ వివరించారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ కె.పుల్లరావు, నేషనల్ హైవే ఏఈ ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల పెంపు, భూ హక్కు చట్టం రద్దు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఇలా పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు విశేషమైన కృషి చేసినట్లు చెప్పారు. అలాగే వారు మళ్లీ సాధారణ జీవితం గడిపేందుకు, ఉపాధి పొందేందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీపావళి తర్వాత మూడు గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మిగిలిన పథకాలను త్వరితగతిన అమలు చేస్తామని ఆయన తెలిపారు.

'కేసుల నుంచి బయటపడటానికే జగన్ దిల్లీకి..'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో జగన్ కేసుల నుంచి బయటపడటానికి మాత్రమే దిల్లీ వెళ్లేవారని కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రూ. వేల కోట్లు రూపాయిలు నిధులు తీసుకు వచ్చారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈపూరులో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎక్కడైనా గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారని కానీ జగన్ తన పాలనలో పంచాయతీల్లో ఉన్న నిధులను సొంత సంపాదన కోసం లూటీ చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో రోడ్లు, సాగరు కాల్వలకు అయిదేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారాయని వాటిని సరిచేస్తామన్నారు. అక్టోబరులో కొత్త పింఛన్లకు దరఖాస్తులు తీసుకుంటారని, దీపావళి నుంచి ఉచిత వంటగ్యాస్ అందజేస్తామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా మండలంలో 48స్వయం సహాయక సంఘాలకు రూ.6.38కోట్లు రుణాలు అందజేస్తున్నట్లు చెక్కు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణారెడ్డి, సర్పంచి పల్లమీసాల చెంచయ్య, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ ఎంపీపీ బొల్లా వెంకటకోటయ్య, తహసీల్దారు నళిని, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న తెదేపా నేతలు మారెళ్ల రామకృష్ణ, రమణ

యడ్లపాడు, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు మేరకు వరద బాధితుల సహాయనిధికి మండలంలోని లింగారావుపాలేనికి చెందిన తెదేపా నేతలు మారెళ్ల రామకృష్ణ, రమణ రూ.2 లక్షలు అందించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాత్రి సీఎం చంద్రబాబునాయుడికి చెక్కు అందజేశారు.

ఆర్డీవోల బదిలీ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ముగ్గురు ఆర్డీవోలు బదిలీ అయ్యారు. ఈమేరకు గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. నరసరావుపేట ఆర్డీవోగా కురుబ మధులత నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీవో సరోజినిని సెక్రటేరియట్‌కు బదిలీ చేశారు. గురజాల ఆర్డీవో వెంకట రమాకాంతరెడ్డిని సత్తెనపల్లికి.. సత్తెనపల్లి ఆర్డీవో మురళీకృష్ణను గురజాలకు బదిలీ చేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మతుకుమల్లి(శావల్యాపురం) : వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తెలిపారు. గురువారం శావల్యాపురం ఆరోగ్య కేంద్రంతో పాటు, మతుకుమల్లి ఎస్సీ కాలనీలోని పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కొబ్బరి చిప్పలు, టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు.

కందిపప్పు వచ్చేసింది

ఈనాడు కథనానికి స్పందన

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన కందిపప్పు సరఫరా ఇప్పటికీ పునరుద్ధరణ కాలేదు. ఈనెల 12న ఈనాడులో "అంగన్‌వాడీల్లో ఉడకని కందిపప్పు" కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. ఈ నెల నుంచి జిల్లాలోని 2031 అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు కందిపప్పు సరఫరా చేయనున్నట్లు ఐసీడీఎస్ పీడీ ఉమారాణి పేర్కొన్నారు.

'కష్టపడి పనిచేసేవారికి పార్టీలో గుర్తింపు'

చిలకలూరిపేట పట్టణం: కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన పిల్లి మాణిక్యరావు, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్‌గా ఎంపికైన దామచర్ల సత్యనారాయణ (సత్య) గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటిని చిలకలూరిపేటలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.

9 కేసుల్లో 10 మంది నిందితుల అరెస్టు

రూ.14 లక్షల విలువచేసే రెండు కార్లు స్వాధీనం

రూ.5.25 లక్షల విలువైన మోటార్లు, రాగి తీగ, కేబుల్ వైరు, ఆటో స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ సుబ్బానాయుడు, ఎస్సై అనిల్‌కుమార్

చిలకలూరిపేట గ్రామీణ న్యూస్‌టుడే: చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో జరిగిన 9 దొంగతనాలకు సంబంధించి 10 మంది నిందితులను అదుపులోకి తీసుకుని రూ. 19.85 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి డాబా వద్ద, నాదెండ్ల మండలం గణపవరం ట్రావెల్స్ వద్ద రెండు కార్లు దొంగతనం చేసిన కేసులో నిందితులు ఊసా మణికంఠ, అన్నపురెడ్డి కార్తీక్, పిల్లి కిరణ్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నిందితుడు బొర్రా ప్రీతమ్ పరారీలో ఉన్నారని తెలిపారు.

రైతుల పొలాల్లో మోటార్లు, రాగి తీగ, కేబుల్ వైరు దొంగల అరెస్టు

జిల్లాలో రైతుల పొలాలు, ఎత్తిపోతల పథకాల వద్ద విద్యుత్తు మోటార్లు, రాగి తీగ, కేబుల్ వైరు గత వైకాపా ప్రభుత్వంలో పెద్ద ఎత్తున దొంగలు ఎత్తుకెళ్లారు. ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలోనే మురికిపూడి, మద్దిరాల గ్రామాల శివారులో, లింగంగుంట్ల ఎత్తిపోతల పథకం వద్ద, లింగంగుంట్ల పొలాల్లో గణపవరం గ్రామంలోని వీరాంజనేయస్వామి ఎత్తిపోతల పథకం వద్ద, జంగాలపల్లి ఎత్తిపోతల పథకం వద్ద, సొలస గ్రామ పొలాల్లో విద్యుత్తు మోటార్లు, రాగితీగ, కేబుల్ వైర్లను.. కోటప్పకొండ, యడ్లపాడు, వంకాయలపాడు మైదవోలు గ్రామానికి చెందిన నిందితులు నల్లబోతుల సామేలు, పాకనాటి శివ లక్ష్మయ్య, పాకనాటి గోపి, బండారు గోపి, రాచమంటి శ్రీనివాసరావు, నాగబోయిన శ్రీనివాసరావు, గుంజి ప్రేమ్‌కుమార్‌లు ఆటో ఏర్పాటు చేసుకుని ఈ దొంగతనాలకు పాల్పడ్డారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై అనిల్‌కుమార్, ఏఎస్సై రోశిబాబులు సిబ్బంది సహకారంతో నిఘా పెట్టి చాకచక్యంగా ఏడు దొంగతనం కేసులకు సంబంధించి ఏడుగురు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి విద్యుత్తు మోటారు ఒకటి, కేబుల్ వైరు 50 మీటర్లు, రాగితీగ, రూ. 5లక్షల నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. 9 కేసులకు సంబంధించి 10 మంది నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసుల్లో కీలకంగా పని చేసి నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ సుబ్బానాయుడు, ఎస్సై అనిల్‌కుమార్‌ను, ఏఎస్సై రోశిబాబు, సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

యువకుల ఘర్షణ.. ముగ్గురికి కత్తిపోట్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో యువకుల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురికి కత్తి గాయాలైన ఘటన పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద గురువారం చోటుచేసుకుంది. మార్కెట్ వద్ద భవన నిర్మాణ పనుల్ని రఫీ, ఉమర్, అల్తాఫ్ చేయిస్తున్నారు. అదే సమయంలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్ వద్దకు షరీఫ్, ఖాసిం వచ్చారు. వారి మధ్య గతంలో పాత గొడవలు ఉండటంతో తమవైపు చూస్తున్నారని ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు. అదికాస్తా ఘర్షణగా మారింది. ఈక్రమంలో ఖాసిం తనవద్ద ఉన్న కీచైన్ కత్తితో దాడి చేయడంతో రఫీ, ఉమర్, అల్తాఫ్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. గాయాలైన ముగ్గురిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

స్కూల్‌గేమ్స్ అండర్-19 ఎంపికలు వాయిదా

సత్తెనపల్లి: ఈనెల 28న చిలకలూరిపేటలోని ఆదర్శ జూనియర్ కళాశాలలో నిర్వహించతలపెట్టిన అండర్-19 బ్యాడ్మింటన్, అక్టోబరు 3న చిలకలూరిపేట ఏఎంజీ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన నెట్‌బాల్, జూడో ఎంపిక పోటీలు వాయిదా పడినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. తదుపరి నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన చెప్పారు

బంగారం ఆశ చూపి.. రూ.లక్షలు కాజేసి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: బంగారం ఆశ చూపి రూ.లక్షలు దోచుకుంటున్న ముఠాను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోదుగుండ్ల గ్రామానికి చెందిన సోదరులు నోముల ప్రకాష్, మత్స్యగిరి వ్యాపారంలో నష్టపోయారు. సులువుగా డబ్బులు సంపాదించాలని వారికి తెలిసిన రాజుపాలెం మండలం అనుపాలేనికి చెందిన తాపీ మేస్త్రీ కొమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, బెల్లంకొండ మండలం మాసపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, డేరంగుల కృష్ణవేణి మొత్తం ఐదుగురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. కొమెర రత్తయ్య, రేణు కలిసి సత్తెనపల్లిలో కొన్ని నకిలీ బంగారు బిస్కెట్లు తయారు చేయించారు. తెలంగాణకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డిని ఈనెల 2న ప్రకాష్ కలిసి తన బంధువులు పాత ఇంటిని కూల్చివేస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని, వాటిని తక్కువ ధరకు తీసుకుందామని చెప్పి సాగర్ సిమెంట్ పరిశ్రమ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లాడు. వెంకటరెడ్డి నుంచి రూ.7 లక్షలు తీసుకొని బంగారం ఇవ్వకుండా పారిపోయాడు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి ముఠాను అరెస్టు చేశారు.

చదరంగం పోటీలకు ఎంపిక

క్రోసూరు(అచ్చంపేట) న్యూస్‌టుడే: క్రోసూరు జైభారత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ జ్ఞానేంద్ర రెడ్డి తెలిపారు. షేక్.అరీఫ్, తులసి చైతన్య నియోజక వర్గ పోటీల్లో ప్రథమంగా నిలిచి జిల్లాస్థాయికి ఎంపిక య్యారన్నారు. 400 మీటర్ల పరుగు పోటీలలో కె.సిద్దార్థ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

సత్తెనపల్లి
• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు


రహదారిలో ఆక్రమణలు, పశువుల వ్యర్థాల దిబ్బలను పరిశీలిస్తున్న తహసీల్దారు దానియేలు, సర్పంచి రాజు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: రహదారులు, కాలువలు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని తహసీల్దార్ మీసాల దానియేలు హెచ్చరించారు. రహదారి ఆక్రమణలతో ఆ మార్గంలో వెళ్లేందుకు పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చెత్త దిబ్బలతో దుర్వాసన వస్తోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో సామాజిక ఆరోగ్య కేంద్రం, శ్మశానానికి వెళ్లే రహదారిలో గురువారం సర్పంచి రాజుతో కలిసి పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలని స్థానికులకు సూచించారు.

పత్తి రైతుకు తీవ్ర నష్టం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాల నియోజకవర్గంలో పత్తి సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది వర్షాభావ పరిస్థితులతో పంట దెబ్బతినగా.. ఈసారి అధిక వర్షాలకు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. పత్తి పొలాలు నీట మునిగి పంటలకు ఎర్ర తెగులు సోకింది. మొక్కలు నల్లబారి ఎండిపోతున్నాయి. గురజాల డివిజన్‌లో సుమారు 67 వేల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. పత్తి ఎర్రగా మారి, కాయలు రాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.


మాడుగులలో ఎర్రగా మారిన పత్తి

తిరుమల ఆలయ ప్రతిష్ఠకు భంగం


తిరుమల పరిరక్షణ ర్యాలీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: తిరుమల ఆలయ ప్రతిష్ఠను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో దిగజార్చారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. తిరుమల పరిరక్షణ డిమాండ్‌తో గురువారం స్థానిక సనాతన హిందూ పరిరక్షణ సమితి చేపట్టిన ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిరుమల కొండపైకి భక్తులు రాకుండా చేయాలనే దురుద్దేశంతో మంచినీళ్లు అందుబాటులో లేకుండా చేయడం, అన్నప్రసాదాలు తొలగించడంలాంటి అనేక అసౌకర్యాలు, అవరోధాల్ని జగన్ కలిగించినా భక్తుల్ని దూరం చేయలేకపోయాడన్నారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి అందరి మనోభావాల్ని వైకాపా ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. హిందూ దేవాలయాలపై దాడి చేసిన వారిని, లడ్డూ ప్రసాద అపచార దోషుల్ని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి వడ్డవల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కన్నా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఉత్సవ విగ్రహాలను ఆవు పాలతో సంప్రోక్షణ చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యెల్లినేడి రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి చౌటా శ్రీనివాసరావు, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, ఆలయ కమిటీ బాధ్యులు శ్రీరామమూర్తి, భుజంగరావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో హోమం

అమరావతి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటంపై అఖిలభారత బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో గురువారం అమరేశ్వరాలయంలో సుదర్శన మహాశాంతి హోమం నిర్వహించారు. తితిదే చేస్తున్న కార్యక్రమాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ప్రసాదుశర్మ తెలిపారు. పీసపాటి నాగేశ్వరశర్మ, ఈట వేమూరి గోపి, భాజపా నేత వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సుదర్శన మహాశాంతి హోమం నిర్వహిస్తున్న అఖిలభారత బ్రాహ్మణ సంఘ నేతలు

ప్రకృతి వ్యవసాయం మేలు

దాచేపల్లి: ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేసి, అధిక శాతం మంది రైతులు సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి తెలిపారు. గురువారం గామాలపాడు గ్రామ రైతులతో మాట్లాడిన ఆమె ప్రకృతి వ్యవసాయంలో పండించిన బంతి పూల పంటకు, రసాయనాలతో సాగైన పంటకు వ్యత్యాసాన్ని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో బంతి పూల దిగుబడి ఎక్కువగా వచ్చినట్లు గుర్తించారు.


న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: న్యాయవాదులపై ఉక్కుపాదం మోపేందుకు కుట్రపన్ని కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొస్తుందని, న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు కోరుతూ గురువారం స్థానిక న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహంవద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ మాట్లాడుతూ దాడులు జరగకుండా నిలువరించి పరిరక్షించే చట్టాలు తీసుకురాకుండా, ఇబ్బందిపెట్టే చట్టాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించడం సరికాదన్నారు. సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ బాధ్యులు వెంకటకోటయ్య, రవి, వెంకటేశ్వరరావు, చినసత్యనారాయణ, విజయ్‌కుమార్, పాపారావు, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: గారపాడు గ్రామంలో కాల్వల పూడికతీత పనులను ఆటంక పరిచి సర్పంచి భర్తపై దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలునాయక్ తెలిపారు. మంగళవారం గ్రామంలో చేపడుతున్న కాల్వల పూడికతీత పనులు అడ్డుకోవద్దని, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దంటూ నచ్చచెప్పేందుకు వెళ్లిన తనను కందిమళ్ల గోపి, మద్దుకూరి వీరాంజనేయులు అకారణంగా నెట్టి, కులం పేరుతో దూషించారంటూ సర్పంచి భర్త కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధి అబ్బూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో దళిత బహుజన వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురువారం జరిగింది. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రాధాన్యతను కేంద్రం ప్రాంతీయ సమన్వయకర్త వెంకటరమణ వివరించారు. విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞను హెచ్‌ఎం పాపయ్య చేయించారు. స్వచ్ఛతా ప్రదర్శన నిర్వహించారు. కేంద్రం ప్రతినిధి మల్లెల చిన్నప్ప, కార్యదర్శి హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రగతిపై ప్రచారం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెన్నాయిపాలెంలో తెదేపా, జనసేన నేతలు మొక్కలు నాటారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన ప్రగతిని ప్రజలకు నేతలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య, మండల ప్రత్యేకాధికారి ఆంజనేయులు, ఎంపీడీఓ జి.కాశయ్య, తెదేపా మండల కన్వీనరు జి.వెంకటేశ్వర్లు, జనసేనపార్టీ మండల కన్వీనరు కె.రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 21, 22వ వార్డులోనూ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి
• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

ఇంటిని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదాం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కూటమి సభ్యులు

దుర్గి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గిలో జడ్పీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి సభ్యులు భారీ ప్రదర్శన నిర్వహించారు. బస్టాండు కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ప్లాస్టిక్ వద్దు, కాటన్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఇంటితో పాటు వీధిని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణగుప్త, సమన్వయకర్త బెంజిమెన్, కూటమి సభ్యులు రామకృష్ణ, రవి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు పాటుపడాలి

దాచేపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని గుంటూరు ఏపీపీసీబీ ఈఈ నజినా సూచించారు. గురువారం గ్రామపాడు శివారులోని ఆంధ్ర సిమెంట్ పరిశ్రమలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ, ఉద్యోగుల కాలనీలో మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఈ సుమంత్, ప్లాంట్ హెడ్ సుబ్బారావు, సుబ్బారెడ్డి, వీర ప్రకాష్, నవీన్ రెడ్డి, గణేష్, రామకృష్ణ, తారక్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఈ నజినా

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? అంచరివారి వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేక, వర్షపునీరు వీధుల్లో నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారి విష జ్వరాలకు కారణమవుతోంది. - **వీరయ్య, మండాది**

✔ గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్నాం. త్వరలో అంచరివారి వీధిలో డ్రైనేజీలు నిర్మిస్తాం. - **ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి**

? తండాలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో ఇబ్బంది ఉంటోంది. - **బుక్యానాయక్, కొత్తపుల్లారెడ్డిగూడెం**

✔ రెండు మూడ్రోజుల్లో తండాలోని అన్ని విద్యుత్తు స్తంభాలకు దీపాలు వేయిస్తాం. - **మకేటలాల్, పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, వెల్దుర్తి

? అమరావతిలోని గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి వెంబడి, అమరావతి నుంచి గుంటూరు వెళ్లే దారి శివారులో రోడ్డు పక్కనే చెత్త వేస్తున్నారు. - **వెంకటేశ్వరరావు, అమరావతి**

✔ చెత్తను సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **నాగరాజు, పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, అమరావతి

? అచ్చంపేట పోలీస్‌స్టేషన్ నుంచి చామర్రు వెళ్లే రహదారి మార్జిన్లు లేకపోవడంతో వర్షపునీరు ప్రధాన రహదారిపై నిలబడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **సాంబశివరావు, చామర్రు**

✔ పంచాయతీ, రెవెన్యూ, పోలీసు సహకారంతో మార్జిన్ల ఆక్రమణలు తొలగించి, సరిచేస్తాం. - **సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, అచ్చంపేట

? వెంకటాపురంలో వీధి దీపాలు వెలగక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. - **తోట చెంచుకాలనీ వాసులు**

✔ సర్పంచి దృష్టికి తీసుకెళ్లి త్వరలో వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. - **అంజారావు, పంచాయతీ కార్యదర్శి**

? పోలేపల్లి పాతూరులో మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. - **వెంకటేశ్వర్లు, స్థానికుడు**

✔ సర్పంచి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పూడిక తొలగిస్తాం. - **అంజారావు, పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, దుర్గి

? కందిపాడులోని ప్రధాన రహదారిపై మురుగు నీరు చేరి, దుర్వాసన వస్తోంది. - **వెంకటరావు, స్థానికుడు**

✔ పంచాయతీ సిబ్బంది మురుగు కాలువలు శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటాం. - **అనిమిరెడ్డి, ఎంపీడీవో**
- న్యూస్‌టుడే, బెల్లంకొండ

సొంతింటి కల సాకారానికి అడుగులు

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

మధ్యతరగతి వర్గాల సొంతింటి కల సాకారం చేసేందుకు ఉద్దేశించిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ స్మార్ట్‌టౌన్‌షిప్‌గా మార్చి కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రెండున్నరేళ్లుగా కాగితాలకే పరిమితమైన భూసేకరణ, ఇళ్ల నిర్మాణం ఇక చకచక ముందుకు కదలనుంది. పట్టణాలకు దగ్గర్లోని ప్రైవేట్, ప్రభుత్వ భూముల్ని ఈ పథకానికి పరిశీలించనున్నారు.


సత్తెనపల్లిలో పరిశీలించిన ప్రైవేట్ భూములు

గతంలో మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూశాఖలు సమన్వయంతో కొన్ని భూముల్ని ఎంపిక చేశాయి. వాటిలో వెంటనే పనులు చేపట్టేందుకు అనువుగా ఉన్నవి గుర్తించి నిర్మాణాలు చేపట్టనున్నారు.

☛ మిడిల్ ఇన్ కం గ్రూపు(ఎంఐజీ)కి చౌకధరకు ఇళ్ల స్థలాలు అందజేసేందుకు 2021 మార్చిలో జగనన్న స్మార్ట్‌టౌన్ పథకం కింద దరఖాస్తులు స్వీకరించారు. ఇళ్లస్థలాలు అందకపోవడంతో మధ్యతరగతి కుటుంబాలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 25,216 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 2 నుంచి 3 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

పల్నాడు జిల్లాలో పట్టణాల వారీగా 150, 200, 240 చదరపు గజాల స్థలాలకు ఎంఐజీ (గ్రూపు) నుంచి స్వీకరించిన దరఖాస్తులు ఇలా..

పట్టణం	చదరపు గజాలు 150	200	240	మొత్తం
మాచర్ల	174	154	108	436
పిడుగురాళ్ల	243	136	103	482
సత్తెనపల్లి	235	240	61	536
దాచేపల్లి	15	12	29	56
గురజాల	16	4	1	21

దరఖాస్తుల వడబోత..
స్థలాల పరిశీలన

☛ అన్ని మౌలిక వసతులతో లేఅవుట్లు వేసి, ఎకరానికి 150 చదరపు గజాల ప్లాట్లు 15, 200 గజాల ప్లాట్లు 12, 240 గజాల ప్లాట్లు 10 వస్తాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

☛ భూమి సమీకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేందుకు జిల్లా సంయుక్త కలెక్టర్ పర్యవేక్షణలో మరో ఐదుగురు అధికారులతో కమిటీని గతంలో ఏర్పాటు చేశారు. కొత్తగా మళ్లీ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు.

☛ వార్షిక ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.18 లక్షల లోపు ఉన్న వారికి జగనన్న స్మార్ట్‌టౌన్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చేలా దరఖాస్తుల వడబోత కూడా చేపట్టారు.

☛ పట్టణానికి 3 కిలోమీటర్లలోపు దూరం ఉండి రవాణా, విద్య, వైద్య వసతి అందుబాటులో ఉన్న భూముల్ని పరిశీలించి రైతులతో సంప్రదింపులు జరిపారు.

☛ సత్తెనపల్లి పట్టణంలో 536 మందికి 44 ఎకరాల భూమి అవసరంకాగా గుంటూరు రోడ్డులోని ప్రైవేట్ భూముల్ని పరిశీలించారు. మిగిలిన పట్టణాల్లోనూ అభివృద్ధికి అవకాశమున్న ప్రాంతాల్లోని భూముల్ని సేకరించాలనే ఆలోచన చేశారు.

☛ ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లను 20 శాతం రాయితీతో.. పెన్షనర్లకు 5 శాతం ప్లాట్లను రిటేల్ కాకుండా పొందే అవకాశం కల్పించనున్నారు.

28న జాబ్‌మేళా

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 28న పిడుగురాళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె. సంజీవరావు ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్ మైండ్స్, ఐలా అగ్రి సర్వీసెస్, రిలయన్స్ రిటైల్, ముతూట్ ఫైనాన్స్ లిమిటెడ్, మాక్స్ ఫ్యాషన్ రిటైల్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసి, పీజీ చదివి, నిరుద్యోగులైన యువతి యువకులు హాజరు కావచ్చన్నారు. వయసు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు.

ఎంపీడీవోగా అనిమిరెడ్డి

బెల్లంకొండ, న్యూస్‌టుడే: మండల ఎంపీడీవో అనిమిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల తెదేపా నాయకులు మస్తాన్ షరీఫ్, సర్పంచ్ గడ్డిపర్తి జ్యోతి సముద్రం తదితరులు ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మోటార్ల దొంగ అరెస్టు

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లచెరువుకు చెందిన బాలకిరణ్‌రెడ్డి పొలంలోని విద్యుత్తు మోటార్లు, తీగలను దొంగతనం చేస్తుండగా ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. గురువారం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన వివరించారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు కృషి


చిగురుపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

చిగురుపాడు(అచ్చంపేట), న్యూస్‌టుడే: జగన్ చిన్నాభిన్నం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని చిగురుపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధిపై డాక్యుమెంటరీ తయారు చేసి త్వరలో సీఎంకు అందజేస్తామన్నారు. గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ, సాగు, తాగునీరు, రహదార్ల అభివృద్ధిపై దృష్టి సారిస్తానని తెలిపారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు, దసరా నాటికి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీలు నెరవేర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి గిరిబాబు, ఆశీర్వాదం, సర్పంచి సీతారావమ్మ, యార్డు మాజీ ఛైర్మన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక స్మృతులు భావితరాలకు అందించాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: చారిత్రక స్మృతులు భావితరాలకు తెలిసేలా నేటి తరం ప్రయత్నించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కృష్ణవేణి జూనియర్ కాలేజీలో 'మాచర్ల వరద' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పావులూరి సతీష్ రచించిన ఈ పుస్తకంలో 1964లో మూడ్రోజులపాటు కురిసిన భారీ వర్షంతో చంద్రవంక వాగు ఉగ్రరూపం దాల్చి చేసిన నష్టాన్ని కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. ఇలాంటి చారిత్రక పుస్తకాల వల్ల నాటి నష్టాలు, ప్రజల బాధలు తెలుసుకునే వీలు నేటి పౌరులకు కలుగుతుందన్నారు. అనంతరం రచయితను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకట్రామయ్య, మున్సిపల్ ఛైర్మన్ నరసింహారావు, రామనాథశర్మ, రామకృష్ణారావు, నాగయ్య, వాసవీ క్లబ్ అధ్యక్షుడు చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.


'మాచర్ల వరద' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, రచయిత సతీష్ తదితరులు

యూరియా అధిక ధరలకు విక్రయించొద్దు

క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు మండలం దొడ్లేరులో ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఎరువుల ధరలపై మండల వ్యవసాయాధికారి 8331056937, ఏడీఏ 8331056936 చరవాణి నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

అచ్చంపేట, న్యూస్‌టుడే: గింజుపల్లితండాకు చెందిన భూక్యా రమణనాయక్ తెలంగాణ రాష్ట్రం దొండపాడు నుంచి 80మద్యం క్వార్టరు సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకొన్నట్లు అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ గురువారం తెలిపారు. నిందితుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్నేహహస్తాలు ఫౌండేషన్ సభ్యులు ఇంజినీరింగ్ విద్యార్థి సందెపోగు సుధీర్‌కు గురువారం సీఐ వెంకటప్రసాద్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు. సుధీర్ విజయవాడలోని బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడని స్నేహహస్తాలు సమన్వయకర్త కరిముల్లా బాబు తెలిపారు.

తాగునీటికి ప్రాధాన్యం ఇస్తాం

కోనూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తాగునీటికి ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన కోనూరు ఎస్సీకాలనీలో రూ.58 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును ప్రారంభించారు. 60 వేల లీటర్ల సామర్థ్యంగల ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా 300 కుళాయిలకు నీరందించేలా రూపొందించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు తెలిపారు. ఎంపీడీవో శివసుబ్రమణ్యం, మండల తెదేపా అధ్యక్షుడు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పని భద్రత కల్పించాలి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: కష్టానికి తగ్గ ప్రతిఫలం అందించి, పని భద్రత కల్పించాలంటూ పౌరసరఫరాల విభాగంలో పనిచేసే హమాలీలు గురువారం స్థానిక గోదాము వద్ద ఆందోళన బాట పట్టారు. నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూలీ రేట్ల అగ్రిమెంట్ బకాయిలతో కూడిన జీవోను విడుదల చేసి రూటు ఆప్టిమేషన్ రద్దు చేయాలని, 10వ తేదీ లోపు నెలవేతనం అందించాలంటూ డిమాండ్ చేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

పాటిబండ్ల(పెదకూరపాడు), న్యూస్‌టుడే: అనారోగ్యానికి గురై వైద్యసేవల కోసం ఇబ్బంది పడుతున్న కార్యకర్త కుటుంబానికి జనసేన పార్టీ నేతలు అండగా నిలిచారు. పాటిబండ్ల గ్రామానికి చెందిన మండాల శ్రావణికి నాయకుడు సాంబశివరావు గురువారం రూ.10 వేలు అందించారు.

ముగిసిన అథ్లెటిక్స్

దుర్గి, న్యూస్‌టుడే: నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్, యోగా పోటీలు గురువారం స్థానిక జడ్పీ పాఠశాలలో నిర్వహించారు. ఐదు మండలాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బండ్ల ప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు చెప్పారు.

నిర్లక్ష్యానికి సాక్ష్యం

గుంటూరు-మాచర్ల, అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారులకు కూడలైన కొండమోడులో పోలీసు అవుట్‌పోస్ట్ ప్రజాసేవకు దూరంగా ఉంది. ఆయా మార్గాల్లో ప్రమాదాల్లో గాయపడ్డవారిని సత్వరమే ఆసుపత్రికి తరలించేందుకు, కూడలిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు 2014లో అప్పటి పోలీసు అధికారులు అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. తొలి ఐదారేళ్ల పాటు సేవలందించగా తరువాత కాలంలో నిర్లక్ష్యానికి గురైంది. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ పోలీసులను అమరావతి ఉద్యమం అణచివేత విధులకు కేటాయించడంతో పాటు, ఇతర విధులకు పంపారు. ప్రస్తుతం అవుట్‌పోస్టు చుట్టూ పిచ్చిచెట్లు పెరిగి అధ్వానస్థితికి చేరింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తిరిగి అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కొండమోడు (రాజుపాలెం)



వరద బాధితులకు చిన్నారుల సాయం


బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పాఠశాల బాధ్యులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: చిన్నారుల సాయం.. వరద బాధితులకు అభయంగా మారింది. పట్టణంలోని రాఘవేంద్ర బాలకుటీర్ విద్యార్థులు కృష్ణానది వరద బాధితుల సహాయార్థం రూ.1.20 లక్షలు విరాళాలుగా సేకరించారు. ఆ నగదుతో నిత్యావసర సరకులు, దుస్తులు కొనుగోలు చేసి కొల్లూరు మండలం తోకలవానిపాలెం, రావిలంక, కృష్ణానగర్‌లోని 100 కుటుంబాలకు అందజేశారు. లంక గ్రామాలకు నేరుగా బాలకుటీర్ పాఠశాల బాధ్యులువెళ్లి సాయం అందజేసి పెద్దమనసు చాటారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బరాయుడు, అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ప్రిన్సిపల్ గీతాంజలి, ప్రజానాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై నమ్మకంతోనే విరాళాల వెల్లువ


ఇది మంచి ప్రభుత్వం కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


మహిళకు కరపత్రం అందజేస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థ నాయకత్వంపై నమ్మకంతోనే విజయవాడ వరద బాధితులకు విరాళాలు వెల్లువలా వచ్చాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వార్డులో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ షమ్మి, కౌన్సిలర్ అబ్రహం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రామస్వామి, తెదేపా నాయకులు నాగరాజు, మేరిగ్రేస్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

మాచర్ల (కారంపూడి): మహిళా సంక్షేమానికి తెదేపా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మానుకొండ కల్యాణ మండపంలో సంక్షోభంలోనూ సంక్షేమం 100 రోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా పాలనలో ప్రజలు అభద్రతా భావనలో కూరుకుపోయారని, ఎన్డీయే ప్రభుత్వం రాకతో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.7.14 కోట్ల రుణాల చెక్కును అందించారు. పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, గబ్రూనాయక్, కేశవరెడ్డి, మల్లిఖార్జునరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకు ఏలూరు జిల్లా పెద్దవేగిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండాదిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి వీరాంజనేయులు ఎంపికయ్యారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు నాగరాజకుమారి, పీఈటీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా ఖోఖో పోటీలు..

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: జానపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురజాల నియోజకవర్గం ఎస్.జి.ఎఫ్ ఖోఖో పోటీలు గురువారం జరిగాయి. ఈ పోటీల్లో పట్టణంలో ఆక్స్‌ఫర్డు విద్యాసంస్థల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి అండర్-17 విభాగానికి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పి.నరేష్ తెలిపారు.

బ్యాడ్మింటన్, చెస్...

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను జీఆర్‌సీఆర్‌కె శ్రీచైతన్య పాఠశాల డైరెక్టర్ గుత్తా రాము, జడ్పీ పాఠశాల హెచ్.ఎమ్ రమణ ప్రారంభించారు. బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో నైపుణ్యం కనబర్చిన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: చీదెళ్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాచేపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉపకార వేతనాలు అందించారు. గత విద్యాసంవత్సరంలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురికి రూ.10,000 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు జ్ఞానేశ్వర్, పవన్ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల చేయూత: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు సేకరించారని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం రూ.లక్ష బాధితులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఐలమ్మ జయంతి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని పట్టణంలో ఐలమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకుడు పాండురంగారావు, ఛైర్మన్ నరసింహారావు, ప్రసాద్, కేశవరెడ్డి, శ్రీను, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు సబ్బులు, కొబ్బెరి నూనె, యూనిఫాం, చెప్పులు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలల హెల్త్ అలవెన్స్, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, టి.ఎల్.ఎఫ్ కార్మికులు, ఎన్‌ఎంఆర్‌లను ఆప్కా సంస్థలో చేర్చాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆస్తి వివాదంతో ఇల్లు కూల్చివేత


నేల మట్టమైన ఇల్లు

అమరావతి, న్యూస్‌టుడే: అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదంలో అన్న కుమారుడి ఇల్లు కూల్చివేసిన ఘటన మండలంలోని అత్తలూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వేముల వెంకటప్పయ్య కుమారులు పెద వెంకటేశ్వర్లు, చిన వెంకటేశ్వర్లు, వేముల కోటేశ్వరరావు మధ్య ఆస్తి వివాదం ఉంది. కక్ష కట్టిన వేముల కోటేశ్వరరావు మరి కొంతమంది వచ్చి బుధవారం పెద్ద వెంకటేశ్వర్లు కుమారుడు గుండారావు ఇంటిని జేసీబీతో కూల్చివేసి నేలమట్టం చేశాడు. పొలం పనులకు వెళ్లిన సమయంలో తన ఇంటిని కూల్చేశారని బాధితుడు గుండారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కుంగిన దారి.. ప్రమాదకంగా మారి



సత్తెనపల్లి నుంచి లక్కరాజుగార్లపాడు వెళ్లే రహదారి ఛిద్రమై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సత్తెనపల్లి నుంచి ఫిరంగిపురం మండలంలోని గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఈ మార్గం అనుకూలంగా ఉంటుంది. ప్రాముఖ్యత కలిగిన రోడ్డుకు ఇరువైపులా బెరమ్స్ లేక ఎదురెదురు వాహనాలు తప్పుకునే సమయంలో ప్రమాదం పొంచి ఉంది. అదుగడుగునా రోడ్డు కుంగిపోయింది. బ్రాంచి కాలువ సమీపంలో కుంగి కందకంలోకి జారిపోయింది. ఏ మాత్రం ఏమరుపాటుతో చోదకులు ఉన్నా ప్రమాదం తప్పదు. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి గ్రామీణ**


ప్రయాణమంటే హడలే



గురజాల - కారంపూడి రహదారిలో ప్రయాణమంటేనే హడలెత్తిపోతున్నారు. గురజాల పట్టణం సాయిబాబా దేవస్థానం ఎదురుగా లోతైన గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు పరిశీలించి గుంతలను పూడ్చించాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

పోలీసులకు ఎన్ని కష్టాలో..

క్రోసూరు స్టేషన్ సమీపంలోని పోలీసుల నివాస గృహాలు మరమ్మతులకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారు. 2003లో పది నివాస గృహాలు నిర్మించారు. ప్రస్తుతం కొందరు పోలీసులు నివాసం ఉంటున్నారు. కొన్ని ఇళ్ల పైకప్పు దెబ్బతింది. మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. తాగునీటి ట్యాంకు పగుళ్లిచ్చింది. రాత్రి వేళ విషసర్పాలు సంచరిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, క్రోసూరు(అచ్చంపేట)



నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

స్వర్ణాంధ్ర - 2047పై ప్రత్యేక అవగాహన

శావల్యాపురం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047పై గ్రామ స్థాయిలోని ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఎంపీడీవో సీతారామయ్య తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ట్రాఫిక్ సీఐగా లోకనాథం



మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట ట్రాఫిక్ సీఐగా సీహెచ్ లోకనాథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నరసరావుపేట ఒకటి, రెండో పట్టణ ఎస్సైగా పనిచేశారు. సాధారణ బదిలీలో భాగంగా వీఆర్ నుంచి నరసరావుపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న రమేష్ వీఆర్‌కు వెళ్లారు.

మదమంచిపాడు ఈవో నియామకం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ ప్రాంతానికే ప్రసిద్ధి చెందిన మదమంచిపాడు వీరాంజనేయ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా సుధాకరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో మదమంచిపాడు వచ్చారు. ఇనిమెళ్ల ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దద్దాల కోటేశ్వరరావు మదమంచిపాడుకు బదిలీ అయినట్లు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సుధాకరరెడ్డి

కోడెల పార్కులో దిమ్మె పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



పగులగొట్టిన దిమ్మె

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్వీవీ కాలనీలోని కోడెల శివప్రసాదరావు పిల్లల పార్కులో ఉన్న దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం పగులగొట్టారు. పార్కులో చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అప్పటి ఎమ్మెల్యే కోడెల శివప్రసాదరావు దిమ్మెను నిర్మించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు దానిని ధ్వంసం చేయడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జస్వంతరావును న్యూస్‌టుడే వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదని, తమ సిబ్బంది కూల్చలేదని, గుర్తు తెలియని వ్యక్తులు కూల్చినట్లు సమాచారం వచ్చిందని ఆయన తెలిపారు.

దీక్ష తీసుకున్న జనసైనికులు



దీక్ష తీసుకున్న నాగశ్రీనురాయల్ తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం నేపథ్యంలో పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గురువారం వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసైనికులు దీక్ష తీసుకున్నారు. జరిగిన అపచారాన్ని మన్నించమని స్వామిని వేడుకున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.నాగశ్రీను రాయల్ తెలిపారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



తిమ్మాయిపాలెంలో నిర్వహిస్తున్న ప్రదర్శన

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: యువత సమాజహితం కోరి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రత పాటించాలని సూచించారు.

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు తిరిగి వాడకూడదని అలా వాడితే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని డీడబ్ల్యూఎస్‌సీ కన్సల్‌టెంట్ రమేష్ అన్నారు. గురువారం తిమ్మాయిపాలెం, నరగాయపాలెం గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

అక్కరకు రాని పథకాలు..
అవస్థల్లో ప్రజలు



యడవల్లిలో పనిచేయని కుళాయిలు

జలజీవన్ మిషన్ అమలులో జాప్యం

చిలకలూరిపేట గ్రామీణ న్యూస్‌టుడే

గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన రక్షిత పథకాలు చాలావరకు మూలన చేరాయి. జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరైనా ఎక్కడా పనులు ముందుకు కదలడం లేదు. ఫలితంగా ప్రజాధనం వృథా అవడమే కాకుండా వారి దాహార్తి అవసరాలు తీరడం లేదు. చిలకలూరిపేట మండలంలోని కావూరు, యడవల్లి, మానుకొండవారిపాలెం పథకాలు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించినా రక్షిత చెరువులు లేకపోవడంతో తాగునీటి సమస్య తీరడం లేదు. ఫలితంగా మూడు గ్రామాల ప్రజలు తాగు నీటికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరైనా ఎక్కడా పనులు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.

కావూరులో పనికిరాకుండా పోయిన పథకం

ఆరువేల జనాభా ఉన్న కావూరులో పది హేనేళ్ల క్రితం ఏర్పాటు చేసిన రక్షిత పథకం ఎందుకూ పనికిరాకుండా పోయింది. ప్రారంభంలో బావితో పాటు రక్షిత పథకం పైపులైన్లు ఏర్పాటు చేశారు. బావి నిరుపయోగంగా మారడంతో పథకం మూలన చేరింది. దీంతో లక్షలతో నిర్మించిన రక్షిత పథకం ఉన్నా ప్రజలకు ఉపయోగం లేదు. ప్రస్తుతం బోరు వేసి కొన్ని చోట్ల మాత్రమే దాహార్తి తీరుస్తున్నారు. జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరైనా అడుగు ముందుకు పడని పరిస్థితి.



కావూరులో నిరుపయోగంగా రక్షితనీటి పథకం

యడవల్లిలో రూ.కోటి నిరుపయోగం

యడవల్లిలో దశాబ్దం క్రితం ఏర్పాటు చేసిన రక్షిత పథకం ఇప్పటికీ పనిచేయడం లేదు. రెండు, మూడు విడతలుగా మొత్తం రూ. కోటి రూపాయల నిధులు ఈ పథకానికి ఖర్చు చేశారు. కోటప్పకొండ వద్ద శంభులింగం చెరువు నుంచి నీటిని సరఫరా చేసేలా పైపులైన్లు కూడా ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో అవి పనిచేయకపోవడంతో ఈ పథకం ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో రూ. కోటి రూపాయల ప్రజాధనం దుర్వినియోగమయ్యాయి.

బోర్లతోనే మానుకొండవారిపాలెం పథకం

మానుకొండవారిపాలెంలో ఏర్పాటు చేసిన రక్షిత పథకానికి చెరువు లేకపోవడంతో బోర్ల ద్వారా నడుపుతున్నారు. సాగర్ నీటిని చెరువులో నింపి అక్కడి నుంచి సమీపంలోని రక్షిత పథకం ద్వారా గ్రామానికి సరఫరా చేయాల్సి ఉంది. రూ.లక్షల రూపాయలతో పైపులైన్లు, పథకాలు నిర్మించినా పనికిరాకుండా పోయాయి. ప్రస్తుతం ఉన్న పథకం వద్ద బోర్‌వెల్ వేసి దాని నుంచి నీటిని వాడుకోవడం కోసం గ్రామానికి సరఫరా చేస్తున్నారు. దీంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. మద్దిరాల, కట్టుబడివారిపాలెం గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నా రక్షిత చెరువులు లేవు. ఈ గ్రామాల్లో కూడా బోర్‌వెల్స్ వేసి వాటిని ట్యాంకులకు ఎక్కించి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జలజీవన్ మిషన్ ద్వారా త్వరితగతిన టెండర్లు పూర్తిచేసి అన్ని గ్రామాలకు సురక్షిత నీటిని త్వరితగతిన అందించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేటలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించడంలో పోలీస్, మున్సిపల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పలు ప్రధాన రహదారులలో ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించాలని ఆయన కోరారు.

అవసరాల మేరకు ఎరువుల సరఫరా

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండ నియోజకవర్గానికి అవసరాల మేరకు రసాయనిక ఎరువులు సరఫరా చేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రవిబాబు గురువారం తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి 200 మెట్రిక్ టన్నులు డీఏపీ వచ్చిందని అందులో ఒక్కొక్కదానికి 20 టన్నుల వంతున జీడీసీఎంఎస్ వెల్లటూరు, వినుకొండ, నూజండ్లతో పాటు ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. అధిక దరలకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


వేల్పూరు(శావల్యాపురం),న్యూస్‌టుడే: సొసైటీలలో డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కన్నా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. గురువారం వేల్పూరులోని సొసైటీ గోదాంలో ఎరువుల విక్రయాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎరువుల కొరత లేదని, రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ నిల్వలు సొసైటీ, డీసీఎంఎస్, ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అధిక ధరలకు అమ్మిన డీలర్ల లైసెన్సు రద్దు చేయడంతోపాటు, 6ఎ కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

గుర్రం జాషువాకు నివాళి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జీవన జ్యోతి సంస్థ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129 జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభించారు. భువనచంద్రటౌన్ హాల్‌లో మూడు రోజుల పాటు జాతీయస్థాయి నాటక కళా పరిషత్ నిర్వహించనున్నారు. ఉత్సవాలను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నార్త్ జోన్ జట్టు 259 పరుగులకు డిక్లేర్

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో అండర్-23 ఇంటర్ జోనల్ బాలుర క్రికెట్ పోటీల్లో భాగంగా నార్త్ జోన్- సౌత్‌జోన్ జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్ తొలి రోజు వర్షంతో పూర్తిగా నిలిచిపోగా రెండో రోజైన గురువారం ఆట ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నార్త్ జోన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 259 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని సాయి పూర్ణ 143 బంతుల్లో 100 సెంచరీతో నాట్ అవుట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ షాజహాన్ 53 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ జట్టులోని భార్గవ్‌నాయుడు 4వికెట్లు,రెడ్డి ప్రకాష్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తన తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 66 పరుగులు చేసింది. జట్టులోని బి. యోగానంద 31 పరుగులతో, వై తేజా రెడ్డి 27 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. శుక్రవారం ఆట మిగిలింది.



సెంచరీతో సత్తా చాటిన నార్త్ జోన్ జట్టు బ్యాటర్ సాయిపూర్ణ

వయోజనులకు సార్వత్రిక విద్యాపీఠం వరం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: చదువుకు దూరమైన వారు, బడి మధ్యలో మానేసిన వారు మళ్లీ చదువుకునేందుకు ప్రభుత్వం సార్వత్రిక విద్య ద్వారా అవకాశం కల్పిస్తుందని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ రాష్ట్ర సమన్వయకర్త ఎన్.అక్బర్‌అలీ కోరారు. రొంపిచర్ల మండలాన్ని జిల్లా సమన్వయకర్త కేఎమ్‌ఏ హుస్సేన్‌తో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద సార్వత్రిక విద్య గోడపత్రికలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 ఏడాదికి ఇంటర్‌లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎంఈవో-2 బ్రహ్మేశ్వరరావు, ఎంఈవో-1 హవీలా పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్జేడీ ప్రసాద్ సేవలు వెలకట్టలేనివి



మాట్లాడుతున్న న్యాయవాది లాకా

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: సమాజంలో అందరితో మంచి అనిపించుకోవడం చాలా కష్టమైనా ఈ రోజుల్లో ప్రతి ఒక్కరితో గొప్ప వ్యక్తిగా పిలిపించుకున్న వ్యక్తి విశ్రాంత ఆర్జేడీ ప్రసాద్ అని ఆయన సేవలు వెలకట్టలేనివని ఆయన లేని లోటు పూడ్చలేనిదని విశ్రాంత ఓఎన్‌జీసీ చీఫ్ మేనేజర్ రాజ్‌కుమార్ అన్నారు. వినుకొండకు చెందిన విశ్రాంత ఆర్జేడీ ప్రసాద్ సంస్మరణ సభను ఆయనతో కలిసి చదువుకున్న స్నేహితులు లయోల పాఠశాల్లో నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు డీఈవో జాషువా, డిప్యూటీ కలెక్టర్ అచ్యుతరావు, రిజిస్ట్రార్ జగజీవన్ ఎంఈవోలు జాన్‌సుందరరావు, విజయభాస్కర్, న్యాయవాది లాకా తదితరులు పాల్గొన్నారు.

మురుగులోనే అడుగులు

గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవ వంటి కార్యక్రమాలు చేపట్టినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. మండలంలోని మతుకుమల్లి దక్షిణ బజారులోని రామాలయం ఎదురుగా డ్రైనేజీలో పూడిక తీయక పోవడంతో మురుగునీరు రోడ్డుమీదే పారుతోంది. గ్రామస్థులు కూడా చేసేది ఏమి లేక దుర్గంధం వస్తున్నా నీటిలో నుంచే నడుస్తున్నారు. వర్షం వస్తే పరిస్థితి చెప్పలేమని, డ్రైనేజీ నిండిపోయి రోడ్డు మీదే కాల్వ మాదిరిగా నీరు పారుతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుమీదే పారుతున్న మురుగు నీరు

-న్యూస్‌టుడే మతుకుమల్లి (శావల్యాపురం)

సొమ్ము చెల్లిస్తారా.. వేలం వేయమంటారా?

గణపవరం (నాదెండ్ల), న్యూస్‌టుడే: చెన్నై-కోలకతా జాతీయ రహదారిలో చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు భూమి ఇచ్చిన ఓ రైతు ఖాతాలో ప్రభుత్వ అధికారులు పొరపాటున అధికంగా నగదు జమ చేశారు. ఈ సొమ్మును రెవెన్యూ స్వాధీన చట్టం ప్రకారం తిరిగి రాబట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన రైతు బొప్పూడి వెంకటేశ్వర్లు (లేట్) ఖాతాలో అతనికి చెందాల్సిన పరిహారం కంటే రూ. 1,68,347 అధికంగా జమ చేశారు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని వారుసురాలైన నాగేంద్రమ్మను రెవెన్యూ అధికారులు పలుమార్లు కోరారు. అయినప్పటికీ ఆమె స్పందించకపోవడంతో ఆర్డీవో సరోజిని ఆదేశాల మేరకు గురువారం ఆ భూమిలో వేలం తాకీదు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. 15 రోజుల గడువులోగా ఆ సొమ్ము తిరిగి చెల్లించకుంటే వేలం నిర్వహిస్తామని అందులో పేర్కొన్నారు.



నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

బురదలో నడిచేదేలా..

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట కోడెల శివప్రసాదరావు స్టేడియంలోని నడక దారి కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. బురదలో నడవలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే స్టేడియానికి రావడానికి ఇష్టపడటం లేదు. నిత్యం వందలామంది వ్యాయమం, నడిచేందుకు ఉద్యోగులు, వ్యాపారులు, క్రీడాకారులు వస్తుంటారు. గత ప్రభుత్వం స్టేడియం అభివృద్ధి పూర్తిగా విస్మరించింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నడక దారికి గ్రావెల్ పోసి స్టేడియం అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలి

సాతులూరు (నాదెండ్ల), న్యూస్‌టుడే: ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని, పెరట్లో కూరగాయ పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేసుకోవాలని సీడీపీవో శాంతకుమారి అన్నారు. నాదెండ్ల మండలం సాతులూరులో ఐసీడీఎస్ సెక్టార్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.

యడ్లపాడు: మండలంలోని దింతెనపాడు, తిమ్మాపురంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. తల్లులకు పోషకాహారం, పరిశుభ్రత, పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు.



మొక్క నాటుతున్న సీడీపీవో శాంతకుమారి

అవీ ఇవీ

కొత్త పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిలకలూరిపేట గ్రామీణ న్యూస్‌టుడే: స్థానిక పురుషోత్తమపట్నంలోని 136, వేలూరు రోడ్డులో 163 పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి బి.నారదముని గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

మండల పరిషత్తు సరసభ్య సమావేశం నేడు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రొంపిచర్ల మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.మాధ్యూబాబు గురువారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు యడ్లపాడులో..

యడ్లపాడు, న్యూస్‌టుడే: ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హేమలత తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వినుకొండ: పురపాలక సంఘం సాధరణ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ దస్తగిరి తెలిపారు. ఎజెండాలోని అంశాలు చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

అనధికార యాప్‌లతో మోసపోవద్దు

వినుకొండ, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ వినియోగం సాధ్యమైనంత మేరకు తగ్గించుకోవాలని మోసపూరిత యాప్‌లతో మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులకు సైబర్ స్వచ్ఛత, డిజిటల్ స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు తమ సెల్‌ఫోన్‌కు మోసపూరిత లింకులు పంపి వాటి ద్వారా డబ్బులు గుంజుతారని, జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

ఖోఖో పోటీలకు కస్తూర్బా విద్యార్థులు

నూజండ్ల, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ ఎంపికల్లో భాగంగా నూజండ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉషా తెలిపారు. సీనియర్స్ విభాగంలో విజయలక్ష్మి, జూనియర్స్ విభాగంలో బద్దుల సాయి తేజస్వి, యోగాలో గౌరి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని ఇది కలిసి తిరిగినా, భోజనం చేసినా మరొకరికి రాదని వ్యాధి ఉన్న వారిని దూరం పెట్టడం సరికాదని హ్యాండ్స్‌ప్ కంపర్షన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్కే ఆశ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ స్వచ్ఛంద సంస్థ ఆదేశాల మేరకు వినుకొండ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, హ్యాండ్స్‌ప్ కంపర్షన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లయోల పాఠశాల విద్యార్థులకు మీకు తెలుసా హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షేమం..అభివృద్ధి కూటమి ప్రభుత్వంతో సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట పట్టణం, నరసరావుపేటసెంట్రల్, రొంపిచర్ల, నూజండ్ల, చిలకలూరిపేట గ్రామీణ,న్యూస్‌టుడే : సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి వందరోజులైన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆయా గ్రామాల్లో నిర్వహించారు. గురువారం చిలకలూరిపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో స్వర్ణాంధ్ర- 2047 విజన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కల అని అన్నారు. ఈ సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరించారు. సీఎంగా చంద్రబాబు చేసిన తొలి 5 సంతకాలతోనే రాష్ట్ర దశ మారిందని ఆయన పేర్కొన్నారు. పురపాలకసంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, కమిషనర్ పి. శ్రీహరిబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తోట రాజారమేష్, భాజపా నియోజకవర్గ కన్వీనర్ జయరామిరెడ్డి పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఎంతో మేలు చేశామని ఎమ్మెల్యే అరవిందబాబు అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని 15, 16, 17 వార్డులతో పాటు రొంపిచర్ల మండలం అన్నవరంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి ప్రభుత్వ ఖజానాను వైకాపా నాయకుల సంక్షేమానికి దోచిపెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నూజండ్ల మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దారు రమేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. చిలకలూరిపేట మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికి తిరిగి గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచి శంకరరావు, తెదేపా మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్ పాల్గొన్నారు.



కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ



అధ్వానంగా బొప్పూడి నుంచి రాజాపేట వెళ్లే మార్గం



గోపాళంవారిపాలెం నుంచి మురికిపూడి వెళ్లే రోడ్డు ఇలా..

దారులు ఇలా.. ప్రయాణించేదెలా?

ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిలకలూరిపేట మండలంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా బొప్పూడి నుంచి కొత్త రాజాపేట వెళ్లే మార్గం, గోపాళంవారిపాలెం నుంచి మురికిపూడి వెళ్లే మార్గం గుంతలమయంగా మారాయి. ఈ మార్గంలో ప్రయాణించడం నరక ప్రాయంగా ఉందని 10 గ్రామాల ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ

బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం



ఈఈ శ్రీనివాసరావు, డీఈఈ కిరణ్‌బాబును సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

వినుకొండ, న్యూస్‌టుడే: సాధరణ బదిలీల్లో భాగంగా ఎస్పీడీసీఎల్ నరసరావుపేట ఈఈ ఎస్.శ్రీనివాసరావు అమరావతి సీఆర్‌డీఏకు, వినుకొండ డీఈఈ కిరణ్‌బాబు గుడివాడ రూరల్‌కు బదిలీ అయ్యారు. వీరిని గురువారం స్థానిక విద్యుత్తు ఉపకేంద్రం ప్రాంగణంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఏడుకొండలు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నెయ్య, నిత్యానందం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని కోటప్పకొండ వద్ద సుమారు 60 ఏళ్ల వృద్ధుడు గురువారం మృతి చెందాడు. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం తెల్లచొక్కా, పంచె ధరించి ఉన్న వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఆచూకి తెలిసిన వారు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: న్యాయవాదులపై ఉక్కుపాదం మోపేందుకు కుట్రపన్ని కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొస్తుందని, న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు కోరుతూ గురువారం స్థానిక న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయదేవత విగ్రహంవద్ద నిరసన తెలియజేశారు.